నిబంధనలు తూచ్



ఔషధ నిల్వల్లో అధికారుల ఇష్టారాజ్యం

- ఇరుకు గదుల్లో వందలాది రకాల ఔషధాలు
- కానరాని రిఫ్రిజిరేటర్లు.. ఏసీలు
- మౌలిక వసతుల కొరత..

ఎంజీఎం: రోగులకు మెరుగైన మందులు అందించేందుకు ప్రతీ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ డ్రగ్స్ స్టోర్స్ (సీఎంఎస్) నిర్వహణ ప్రశ్నార్థకంగా మారుతోంది. తెలంగాణ రాష్ట్రానికి రెండో రాజధానిగా పేర్కొంటున్న వరంగల్‌ను మెడికల్ హబ్‌గా మారుతున్న క్రమంలో రెండు ఇరుకైన గదుల్లో సెంట్రల్ డ్రగ్స్ స్టోర్స్‌ను మౌలిక వసతుల లేని ప్రదేశంలో ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే వరంగల్ జిల్లా కేంద్రంలో 1,500 పడకల ఎంజీఎం ఆస్పత్రితో పాటు 100 పడకల సీకేఎం ఆస్పత్రి, 100 పడకల నేత్ర వైద్యశాలకు వరంగల్ సెంట్రల్ డ్రగ్స్ స్టోర్స్ నుంచే మందులు సరఫరా అవుతాయి. అంతేకాకుండా వరంగల్ జిల్లా కేంద్రంలో ఉన్న పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలకు సైతం ఈ సెంట్రల్ డ్రగ్స్ స్టోర్ నుంచే ప్రభుత్వం అందించే మందులు సరఫరా చేయాల్సి ఉంది. నిత్యం వేలాది మంది రోగులకు సరఫరా చేసే సెంట్రల్ డ్రగ్స్ స్టోర్స్ నిర్వహణ చూస్తే పేదలపై అధికారుల ప్రేమ ఏపాటిదో ఇట్టే అర్థమవుతుది.

ఉర్సులో ఇరుకు గదుల్లో..

వరంగల్ జిల్లా కేంద్రంలోని సీకేఎం, ఉర్సు ప్రసూతి ఆస్పత్రిలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన సీఎంఎస్ (సెంట్రల్ డ్రగ్ స్టోర్) ఇరుకైన రెండు గదుల్లో ఏర్పాటు చేశారు.వరంగల్ జిల్లా పరిధిలో ఎంజీఎం, ప్రాంతీయ కంటి దవాఖాన, సీకేఎం ప్రసూతితో పాటు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నర్సంపేట, వర్ధన్నపేట కమ్యూనిటీ ఆస్పత్రి, అర్బన్ హెల్త్ సెంటర్లు,14 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మందులు, సర్జికల్స్‌ను ఈ సీఎంఎస్ నుంచే పంపిణీ చేయాల్సి ఉంది. ఇంత ప్రాముఖ్యం గల మందుల గిడ్డంగికి ముందస్తుగా క్షేత్రస్థాయిలో ప్రణాళిక లేకుండా అప్పటికప్పుడు రెండు చిన్న గదుల్లో ఏర్పాటు చేయడం విస్మయానికి గురిచేస్తోంది. అవసరమైన విశాలమైన భవనాలను సమకూర్చాల్సింది. ఔషధాలు పాడవకుండా అవసరమైన రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండీషన్ రూములు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. మౌలిక సౌకర్యాలు లేకుండా బూత్ బంగ్లాను తలపించే విధంగా స్టోర్ భవనం ఉండడం అధికారుల పనితీరుకు నిదర్శనంగా చెప్పొచ్చు.

ఇరుకు గదుల్లో ఔషధ నిల్వలు

సీఎంఎస్‌ను ఎంజీఎంలోకి మార్చాలి

తాత్కాలికంగా సీఎంఎస్‌ను ఎంజీఎంలో ఖాళీగా ఉన్న ఏదైనా బ్లాక్‌లోకి మార్చితే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. సీఎంఎస్ మందులలో 75 శాతం మందులను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రే వినియోగించుకుంటోందని బడ్జెట్ గణాంకాల ద్వారా తెలుస్తోంది. అలాంటప్పుడు ఉత్తర తెలంగాణ జిల్లాలకు పెద్దదిక్కుగా, రోగులకు బాసటగా నిలుస్తున్న ఎంజీఎంలో తాత్కాలిక సీఎంఎస్ ఏర్పాటు చేస్తే అత్యవసర సమయాల్లో మందుల సరఫరా కూడా సౌకర్యంగా ఉంటుందని కొందరు వైద్యులు అభిప్రాయ పడుతున్నారు. కొత్తగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల సూపర్ స్పెషాలిటీ లోకి మరికొద్ది నెలల్లో ఎంజీఎం వెళ్లనున్న నేపథ్యంలో ఎంజీఎం లేదా, కేఎంసీలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో తాత్కాలికంగా సీఎంఎస్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని అంటున్నారు.

వాహనాల రాకపోకలకు ఇబ్బందులు



ఉర్సు సీఎంఎస్ వద్ద ఐరన్ ర్యాంప్‌లో ఇరుక్కుపోయిన ఆటో (ఫైల్)

ఉర్సు ప్రాంతంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్‌కు ఇరుకైన రోడ్లపై భారీ వాహనాలతో మందులతో వస్తుంటాయి. దాంతో రాకపోకలు కష్టతరంగా మారాయని పలువురు వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీఎంఎస్ ప్రహరీ ప్రధాన గేటులోకి వచ్చిన వాహనాలు కిటిల్ గార్డ్ (ఐరన్ ర్యాంప్)లో ఇరుక్కుపోతున్నాయి.

క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన కొట్టం కుమార స్వామికి రూ.26 వేల, చెరుపెల్లి కొమ్మాలుకు రూ.30 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కల్లెపు రాజశేఖర్ గౌడ్ ఆదివారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్ మంజూరైందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అవుల రాములు, నాయకులు ఉప్పునూతుల లింగమూర్తి, మండల నర్సింహరాములు, పురం మల్లయ్య, మైదం సదయ్య, జన్ను రాజశేఖర్, మైదం రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



సంగెం : ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన సట్ల హరీశ్‌ను మండలంలోని ఎల్గూర్ రంగంపేటలో శాలువాతో ఆదివారం సన్మానించారు. పూలబొకే అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బందెల అంజలి రమేశ్‌బాబు, పెద్దగోని రజని వినోద్ కుమార్ దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

బీమా మంజూరు పత్రం అందజేత



బీమా మంజూరు పత్రాన్ని అందిస్తున్న మురావత్


నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని అక్కల్‌చెడ గ్రామానికి చెందిన ముత్యం రాజు ఇటీవల గుండె సంబంధిత వైద్యం చేయించుకోగా అతడి పాలసీ ఉండడంతో టాటా ఆరోగ్య బీమా కంపెనీ నుంచి రూ.2,97,969 పరిహారం మంజూరైంది. ఈ క్రమంలో రాజుకు సదరు బీమా కంపెనీ మేనేజర్ మురావత్ ఆదివారం మంజూరు పత్రం అందజేసి మాట్లాడారు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ ప్రయోజనం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టాటా కంపెనీ స్థానిక సలహాదార్లు తోట రాము, ననుమాస కరుణాకర్, కుసుమ సందీప్, కాసర్ల నరేశ్, ములుక రేవంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం




పర్వతగిరి : మండలంలోని వడ్లకొండకు చెందిన కట్ట శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడి స్నేహితులు రూ.90 వేల సాయం అందజేశారు. స్నేహితులు కలిసి డబ్బు సేకరించి శ్రీనివాస్ ఇద్దరు కూతుర్ల పేరిట పోస్టాఫీస్‌లో సుకన్య సమృద్ధి పథకంలో డిపాజిట్ చేసి పట్టాను బాధిత కుటుంబానికి ఆదివారం అందించారు. మిత్రుడి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

మదిరలో..



దుగ్గొండి : మండలంలోని మదిరకు చెందిన బూర్గుల యువరాజు ఇటీవల మృతి చెందగా అతడి కుటుంబానికి అతడి పదో తరగతి నాటి మిత్రులు ఆదివారం రూ.51 వేల సాయం అందజేశారు. తొలుత యువరాజు చిత్రపటానికి అతడి మిత్రులు నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



ఖానాపురం : విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందిన ఘటన మండల కేంద్ర శివారులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఊరటి కుమార స్వామికి చెందిన పాడి గేదెలు ఖానాపురం శివారులోని కాకులగుడ్డాల్ కాల్వ దిశగా మేతకు వెళ్లాయి. ఈ క్రమంలో బావుల వద్దకు వెళ్తున్న సర్వీస్ వైర్ తగిలి గేదె విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని బాధిత రైతు తెలిపారు. విద్యుత్ అధికారులు తనకు పరిహారం అందించి న్యాయం చేయాలని రైతు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవాలి



కమలాపూర్ : బడిబాట ప్రచార జాతాలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి



ఐనవోలు : ప్రచారజాతా చేపట్టిన సంఘం నాయకులు

కమలాపూర్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి పాఠశాలలను బలోపేతం చేసి రక్షించుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ (సీఎంఓ) బద్దం సుదర్శన్ రెడ్డి పిలుపునిచ్చారు. టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద ఆదివారం బడిబాట ప్రచారజాత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులతో పాటు ఆర్టీసీ బస్సులోని ప్రయాణికులకు ప్రభుత్వ బడుల ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల్లో వేలాది రూపాయల ఫీజులు చెల్లించి నాణ్యమైన విద్యను పొందలేకపోతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య బోధిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్య పుస్తకాలు, నోటు బుక్కులు, రెండు జతల దుస్తులతో పాటు పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం, రాగి జావ ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న బడిబాట ప్రచార జాతకు విశేష స్పందన వస్తోందని, ఇందుకు కృషిచేస్తున్న టీఎస్ యూటీఎఫ్ బాధ్యులను అభినందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు డి.కిరణ్‌కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.రవీందర్ రాజు, పెండెం రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర రాజారాం, జిల్లా కార్యదర్శులు సీహెచ్.లింగారావు, పి.చంద్రయ్య, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జి.భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు : తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు ఆదివారం ప్రచార జాత నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు వివిధ కూడళ్లలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా తల్లితండ్రులను, ప్రజా ప్రతినిధులు, మేధావులు, యువకులను ప్రత్యక్షంగా కలిసి ప్రజలను చైతన్య పరుస్తూ బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్'ను నిలిపేయాలి

నర్సంపేట : ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన హత్యాకాండను నిలిపేయాలని సీపీఐ(ఎంఎల్) కేంద్ర కమిటీ నాయకుడు గుర్రం విజయ్‌కుమార్, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఆరెల్లి కృష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలోని సిటిజన్ క్లబ్ ఆవరణలో బుర్ర ఆనంద్, మొగిలి ప్రతాప్‌రెడ్డి, మండల యుగంధర్ అధ్యక్షతన ఆల్ ఇండియా కేత్ మజ్దూర్ కిసాన్ సభ, అఖిల భారత రైతు కూలీ సంఘం, రైతు కూలీ సంఘం (ఆర్‌సీఎస్) సదస్సు ఆదివారం నిర్వహించారు. తొలుత క్లబ్ నుంచి అంబేడ్కర్ సెంటర్ మీదుగా అమరవీరుల స్తూపం వరకు ఆపరేషన్ కగార్ వ్యతిరేక నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సదస్సులో విజయ్ కుమార్, కృష్ణ మాట్లాడారు. దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టే దిశగా కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలు, మావోయిస్టులపై మిలిట్రీ, సైనికులు, వేలాది మంది పోలీసు బలగాలతో ముప్పేట దాడి కొనసాగిస్తోందని తెలిపారు. ఇటీవల జరిగిన అన్ని ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని, కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

కదలని వంతెన నిర్మాణ పనులు

- రోడ్డుపై కంకరతో ఇబ్బందులు
- నిధులు లేక పనులు చేపట్టని కాంట్రాక్టర్



అసంపూర్తిగా నిలిచిన వంతెన నిర్మాణ పనులు

వేలేరు : మండల కేంద్రం నుంచి కొత్తకొండ గ్రామానికి వెళ్లే రహదారిలోని ఎల్లమ్మవాగుపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు నిధులు లేకపోవడంతో ముందుకు కదలడం లేదు. కిలో మీటర్ మేర బీటీ రోడ్డు అసంపూర్తిగా ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంతెన నిర్మించిన ప్రదేశంలో ఉన్న మట్టి రోడ్డుపై గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలుస్తోందని, ఎల్లమ్మ వాగుపై రెండు వంతెనలు, కల్వర్టుల నిర్మాణానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.3.50 లక్షల నిధులు కేటాయించగా టెండర్లు దక్కించుకున్న సంబంధిత కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టి కల్వర్టులు, ఒక హై లెవల్ వంతెన నిర్మాణం పూర్తిచేసి పక్కనున్న మరో వంతెన పనులు మొదలు పెట్టి 80 శాతం పూర్తిచేశారు. సదరు కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో పనులను మధ్యలోనే వదిలేశారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా వంతెన, బీటీ రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

జాగృతి పేరుతో కొత్త నాటకానికి తెర

వర్ధన్నపేట : ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఇరుక్కున్న మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత జాగృతి పేరుతో కొత్త నాటకానికి తెర లేపుతున్నారని కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ అధికార ప్రతినిధి బర్ల సహదేవ్ ఎద్దేవా చేశారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో లక్ష కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం పదేళ్ల పూర్తి కాక ముందే కూలి పోవడం అవినీతికి అద్దం పడుతోందన్నారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన బీఆర్ఎస్ పార్టీకి బుద్ధి చెప్పాలని అన్నారు.

చర్యలు చేపట్టి న్యాయం చేయండి

పర్వతగిరి : తన భూమిలో విత్తనాలు వేసి సాగు చేస్తున్న వారిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని మండలంలోని ఏనుగల్‌కు చెందిన మహిళా రైతు బొలుగొడ్డు స్వరూప కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ఆమె విలేకరుల ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. సర్వే నంబర్ 499/ఏలో తనకు 37 గుంటల భూమి ఉండగా కౌలుకు ఇచ్చినట్టు తెలిపారు. కౌలుదారులను గ్రామానికి చెందిన కానుగంటి నవీన్, నల్లపు సౌందర్య, నల్లపు ఉష, వడ్డె రాణి దున్నకుండా అడ్డుకుని బూతులు తిట్టినట్టు తెలిపారు. పోలీస్ కమిషనర్ స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

హనుమకొండ (దామెర) : దామెర మండలం ఊరుగొండలోని జెడ్పీహైస్కూల్‌లో 2002–2003 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా గ్రూప్ ఫొటోలు తీసుకుని సంబురపడ్డారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభాకర్‌రాజు, రామబ్రహ్మం, శ్రీనివాసరావు, ధర్మారావు, రాజు, రవీందర్, సోమయ్య, సుదర్శన్, రాధ, గోవర్దన్, జాకీర్‌అలీ, జహంగీర్, రవి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

- ఎస్సై జక్కుల పరమేశ్



ఉచిత యోగా శిక్షణ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్సై పరమేశ్

శాయంపేట : ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు మూడురోజుల పాటు మండల కేంద్రంలోని నవోదయ హైస్కూల్‌లో శ్రీరామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ వారి ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత యోగా, ధ్యాన శిక్షణలో ప్రజలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని ఆరోగ్యంగా ఉండాలని ఎస్సై జక్కుల పరమేశ్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉచిత యోగా శిక్షణ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. మానవుడు ఆరోగ్యంగా ఉండేందుకు ధ్యానం ఎంతో అవసరమని అన్నారు. విద్యార్థులు ధ్యానం చేయడం వలన ఏకాగ్రత పెరిగి జ్ఞాపకశక్తి వృద్ధి చెందుతుందని తెలిపారు. మూడురోజుల పాటు నిర్వహించే ఉచిత యోగా శిక్షణ కార్యక్రమంలో యువకులు, విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. శ్రీరామచంద్ర మిషన్ సంస్థ కోఆర్డినేటర్ శారద, జిల్లా కో ఆర్డినేటర్ అచ్చయ్య, రమేశ్, రాంబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలి



చెత్తాచెదారంతో కలుషితమైన బావిలోని నీరు

కమలాపూర్ : స్వచ్ఛమైన, సురక్షిత తాగునీరు సరఫరా చేయాలని మండలంలోని కానిపర్తి గ్రామస్తులు కోరారు. ఆదివారం పలువురు విలేకరులతో మాట్లాడారు. గ్రామస్తులకు తాగునీరు అందించే మంచినీటి బావి మురికి గుంటగా మారిందని, వరదనీరు, చెత్తా చెదారం బావిలోకి చేరి నీరంతా కలుషితమవుతోందని తెలిపారు. ఆ నీటినే నల్లా ద్వారా ఇంటింటికీ సరఫరా అవుతుందని అన్నారు. ఆ కలుషిత, మురికి నీటిని తాగడం ద్వారా డయేరియా, జాండీస్, అంటువ్యాధుల బారిన పడే ప్రమాదముందని భయాందోళన చెందుతున్నారు. మంచినీటి బావికి పైకప్పు లేక పోవడంతో గాలిదుమారం వచ్చినప్పుడు చెత్తాచెందారం బావిలోకి చేరుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాల పక్కనే బావి ఉండడంతో విద్యార్థులు ఆటుగా వెళ్తే బావిలో పడే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సంక్షిప్తంగా

చిన్ననాటి స్నేహితుడికి చేయూత



భాస్కర్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

కమలాపూర్ : కెన్సర్‌తో బాధపడుతున్న చిన్ననాటి స్నేహితుడికి తోటి మిత్రులు చేయూతనిచ్చి అండగా నిలిచారు. కమలాపూర్‌కు చెందిన లింగోజు భాస్కర్ కెన్సర్‌తో అనారోగ్యం బారిన పడి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. విషయం తెలుసుకున్న 1994–95 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన మిత్రులంతా ఏకమై భాస్కర్‌కు శనివారం రాత్రి రూ.10 వేలు తక్షణ సాయంగా అందించారు. భవిష్యత్‌లో అన్ని విధాలా అండగా ఉంటామని భరోసానిచ్చారు. శివకుమార్, రాంబాబు, రవీందర్, పున్నంచందర్, కృష్ణంరాజు, శోభన్‌బాబు, లక్ష్మణ్, మహేందర్‌రెడ్డి, శంకర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన కారు

ఒకరి దుర్మరణం



ఎల్కతుర్తి : ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టగా వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ఈ సంఘటన మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్ ఎదురుగా ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన లోకిని సమ్మయ్య (67) ద్విచక్రవాహనంపై (వరహాలు) పందుల ఆహారాన్ని తీసుకొస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన (టీఎస్03 ఎఫ్ఏ 3267) నంబరు గల కారు వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. దీంతో సమ్మయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు విడిచినట్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎంపీ



పాడె మోస్తున్న ఎమ్మెల్యే కడియం

ధర్మసాగర్ : కాజీపేట మండలంలోని రాంపూర్‌కు చెందిన హనుమంతరావు అంతిమయాత్రలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్య పాల్గొన్నారు. అంతకుముందు హనుమంతరావు భౌతికకాయానికి ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు డాక్టర్ నజీర్ పూలమాల వేసి నివాళులర్పించారు.

కాపర్‌వైర్ చోరీ చేసిన వ్యక్తుల అరెస్ట్



అరెస్టు చూపుతున్న ఏసీపీ

ఆత్మకూరు : వ్యవసాయ భూముల వద్ద మోటార్లను ధ్వంసం చేసి కాపర్‌వైర్‌ను దొంగిలించిన నిందితులను దామెర పోలీసులు అరెస్టు చేశారు. ఏసీపీ సతీశ్ బాబు ఆదివారం వివరాలు వెల్లడించారు. ఒరిస్సా రాష్ట్రం బద్రక్ జిల్లాకు చెందిన మాలిక్‌రాజ్‌కుమార్, ఖానాపూర్ మండలం చిలుకమ్మ తండాకు చెందిన గుగులోతు నవీన్‌ను అరెస్టు చేశామన్నారు. వీరి వద్ద నుంచి 153 కిలోల కాపర్ వైరు, రూ.2వేల నగదు, స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దామెర ఎస్ఐ అశోక్ పెట్రోలింగ్‌లో భాగంగా తనిఖీలు చేస్తుండగా నింధితులు తారసపడ్డారని, దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించినట్లు చెప్పారు. కాగా కేసు ఛేదించిన ఎస్సై అశోక్, సిబ్బందిని ఏసీపీ సతీశ్‌బాబు, సీఐ రంజిత్‌రావు అభినందించారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

హనుమకొండ (దామెర) : ఈనెల 3 నుంచి దామెర మండలంలో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి తెలిపారు. జూన్ 3న దామెర జెడ్పీ హైస్కూల్‌లో, 4న సింగరాజుపల్లి, 5న ల్యాదళ్ల, 6న కోగిల్వాయి, 9న వెంకటాపూర్, 10న ముస్త్యాలపల్లి, 11న ఒగ్లాపూర్, 12న పసరుగొండ, 13న పులుకుర్తి, 16న ఊరుగొండలో సదస్సులు జరుగుతాయని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కొనసాగుతాయని, రైతులు హాజరై దరఖాస్తులు సమర్పించాలని ఆమె కోరారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి : జూన్ 3నుంచి 16వ తేదీ వరకు భీమదేవరపల్లి మండలంలోని 12 రెవెన్యూ గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు, తహసీల్దార్ రాజేశ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతీ గ్రామంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సులు ఉంటాయని చెప్పారు. రైతులు భూ సమస్యలపై వినతులు సమర్పించాలని సూచించారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

లక్ష్మణ్ బాపూజీని జాతిపితగా ప్రకటించాలి

- పోపా అధ్యక్షుడు డాక్టర్ రాజేశ్వరప్రసాద్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పరకాల : తొలి మలిదశ తెలంగాణ ఉద్యమాల్లో అన్ని తానై ముందు నిలిచిన కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రభుత్వం అధికారింగా ప్రకటించాలని పరకాల పోపా (పద్మశాలి అఫిషల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్) అధ్యక్షుడు డాక్టర్ పోతాని రాజేశ్వరప్రసాద్ డిమాండ్ చేశారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బాపూజీ భావజాల వ్యాప్తి కోసం జరుగుతున్న కార్యక్రమాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ రోజున బాపూజీ విగ్రహాల వద్ద జాతీయ పతాకాలను ఆవిష్కరించాలన్న పిలుపు మేరకు ఆదివారం సాయంత్రం పట్టణంలోని బాపూజీ విగ్రహం వద్ద వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేశ్వరప్రసాద్ మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన ప్రాణం ఉన్నంత వరకు పోరాడిన కొండా లక్ష్మణ్ బాపూజీని ప్రభుత్వం అధికారికంగా జాతిపితగా ప్రకటించి గౌరవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ రవీందర్, పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు దయాకర్, నాయకులు భిక్షపతి, అశోక్, మదుసూధన్, దేవేందర్, నాగరాజు, శ్రీనివాస్, కుమారస్వామితో పాటు ఆ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణం

నల్లబెల్లి : మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆది వారం శివపార్వతుల కల్యాణం వేడుకగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు మురళి మోహనచారీ ధ్వజారోహణం, రుద్రాభిషేకం జరిపించారు.